క్లుప్తంగా

సింహ వాహనంపై గ్రామోత్సవం

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాల సేవ, స్వస్తివాచకం, అష్టలక్ష్మీ యాగం, సుగంధ పుష్పాభిషేకం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వాలి

బిక్కవోలు: ప్రతిఒక్కరూ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి అన్నారు.శుక్రవారం మండలంలోని కొంకుదురు గ్రామంలో సర్పంచ్ సత్తి వీరమణి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతులను అందించారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, ఎంపీటీసీ నల్లమిల్లి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

బిక్కవోలు: యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి అన్నారు. శుక్రవారం పందలపాక హైస్కూల్ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఖోఖో క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మధురపూడి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బూరుగుపూడి కంటే వినయ్‌తేజ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పురుషుల విభాగం ఫైనల్‌లో కోటి కేశవరం జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో కణుపూరు జట్టు, షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో బుచ్చెంపేట విజయ కేతనం ఎగురవేశాయి. ఈ మూడు జట్లు ఈ నెల 24 నుంచి 30 వరకూ జరిగే నియోజకవర్గ స్థాయిపోటీల్లో ఆడతాయి.

300 కోడి కత్తుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

రాజానగరం: ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి సంక్రాంతి సంబరాలలో కోడి పందేలు, పేకాట, గుండాటలతో పాటు అశ్లీల నృత్య ప్రదర్శనలకు అనుమతులు లేవని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. వాటిపై ప్రజలను చైతన్యపరుస్తూ మండలంలో పర్యటిస్తున్న సమయంలో సంపత్‌నగరం – నామవరాల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 300 కోడి కత్తులు దొరికాయన్నారు. వాటిని స్వాధీనపర్చుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దివాన్ చెరువులో గడప గడపకూ..



దివాన్ చెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: పేదల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరాలు తెలుసుకున్నారు. ఏఏ కుటుంబానికి ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో వివరించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా బాగుండాలి, పేదరికంతో ఎవరూ బాధపడకూడదనే సంకల్పంతో సీఎం జగన్ నవరత్నాలు పేరుతో సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో చేయని అభివృద్ధిని.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో చేసి చూపారన్నారు. అందుకనే రాష్ట్రంలో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. స్థానిక సమస్యలు కూడా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా చాలా వరకు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని ఎంపీడీఓ సాయిబాబా అన్నారు. కైకవోలు గ్రామంలో సర్పంచ్ నూనె పట్టాభి రామన్నచౌదరి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సాయిబాబా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారన్నారు. సంపర పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామల, వైద్యులు కె హిమబిందు, స్వామి తదితరులు శిబిరంలో 175 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి తరుణ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దాట్ల సింహాద్రిరాజు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే జగన్ లక్ష్యం

రంగంపేట: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. ఈలకొలను గ్రామంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన వైద్యులు రవికుమార్, పవన్ కుమార్, చంద్రశేఖర్‌తో పాటు రంగంపేట పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, చిన్నారావు మొత్తం 481 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, పార్టీ కన్వీనర్ బత్తిన రాంబాబు, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు తదితరులు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

507 మందికి వైద్యసేవలు

సీతానగరం: మిర్తిపాడులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 507 మందికి వైద్య సేవలు అందించారు. మందులను సర్పంచ్ బంగారు సత్యవతి, ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి పంపిణీ చేశారు.

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని ఎంపీటీసీ బందారు శివ అన్నారు. శుక్రవారం ఊలపల్లి సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 540 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయతా భావాన్ని పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అట్టహాసంగా జాతీయ యువజన దినోత్సవం



ఉందుర్తి రమేష్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: భారతీయ యువతకు దిశానిర్దేశం చేసిన స్వామి వివేకానందుని స్ఫూర్తితో జాతీయతా భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వివేకానందుని భావజాలంపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఇదిలా వుండగా 160 కి.మీ. ఆగకుండా పరుగెత్తిన పరుగుల వీరుడు ఉందుర్తి రమేష్ తన ప్రతిభను మరింత మెరుగుపరచుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆయనకు అందజేసి, క్రీడారత్న బిరుదుతో సత్కరించారు. అదేవిధంగా సమాజంలో వివిధ రంగాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్న అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డిని సేవారత్న బిరుదుతో సత్కరించారు. స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు అందుకున్న గ్రామానికి చెందిన తాడి చంద్రశేఖర్‌రెడ్డి, జీబీఆర్ విద్యాసంస్థలో చదివి, ఇదే విద్యాసంస్థలో డిగ్రీ, పీజీ కోర్సుల ప్రిన్సిపాల్, ఇటీవల డాక్టరేట్ పొందిన ఎస్పీ అబ్బాయిరెడ్డిని విద్యారత్న బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీబీఆర్ వాకర్స్, జిమ్, షటిల్ క్లబ్ విభాగాలకు చెందిన తేతల ఉపేంద్రరెడ్డి, తేతలి త్రినాథరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, ఎం.దుర్గాప్రసాద్, లెఫ్ట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దేశ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం వివేకానంద

పెదపూడి: స్వామి వివేకానంద దేశ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డీ వెంకటేశ్వర్లు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవాన్ని రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. మండలంలో గత నెల నిర్వహించిన వివేకవర్ధని–2 మూడంచెల పరీక్షల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంఈఓలు పాల్గొన్నారు.

పేదలకు సొంతిల్లు సీఎం ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- 30 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



కొత్త వీరంపాలెంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: రాష్ట్రంలో పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కొత్త వీరంపాలెం గ్రామంలో నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల స్థలాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంత భారీఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని 31 లక్షల నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం 30 మంది పేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

30 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేత....

మండలంలోని సుభద్రంపేట, దొడ్డిగుంట, ఈలకొలను గ్రామాల్లో నివసిస్తున్న ఎస్టీ మల్లికాసుల సామాజిక వర్గానికి చెందిన 30 మందికి జిల్లా కలెక్టర్ ద్వారా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించారు. వీటిని లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, వాటిని మంజూరు చేయించిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ మత్సా పద్మశ్రీ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మత్సా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అనపర్తి: నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.2.61 లక్షలు విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 480 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3,46,28,623 పంపిణీ చేసినట్టు చెప్పారు.

నిబంధనల ప్రకారం పనులు చేయాలి

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని, లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి హెచ్చరించారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులకు సామాజిక తనిఖీ వేదిక నిర్వహించారు. 2022 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు ఉపాధి హామీ పథకంలో రూ.5,44,74,286కు రూ.5,24,59,107 వేతనాలకు, రూ.20,15,179 మెటీరియల్‌గా చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల వారీగా జరిగిన పనులను వివరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో సోషల్ ఆడిట్ తనిఖీదారుల నివేదికలను చదివారు. కొన్ని పనులకు బినామీ మస్తర్లు వేశారని, వేరే ప్రాంతాల్లో పనులు చేసి, వేరే చోట బిల్లులు చేశారని గుర్తించారు. వాటికి నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీఓ సాయిబాబు, ఎంపీపీ కేత తులసి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు



కూనవరంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం/మధురపూడి: నియోజకవర్గంలో ముగ్గులు పోటీలు సందడిగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శుక్రవారం అన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలం ఉండేశ్వరపురం, కూనవరం, చినకొండేపూడి, అలాగే కోరుకొండ మండలం పాత మునగాల, కొత్త మునగాల, గాదరాడల్లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు జక్కంపూడి విజయలక్ష్మి బహుమతులు అందించారు.

ముగ్గుల పోటీలు

మధురపూడి: కోరుకొండ రథం రోడ్డులోని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నివాస గృహం రోడ్డులో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 86 మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొండాడ చందు వ్యవహరించారు. కాశీ విశాలాక్షి, రమ్యశ్రీ, మౌనిక విజేతలుగా నిలిచారు. వారికి శనివారం ఉదయం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాస గృహంలో బహుమతులు అందజేస్తారు.

పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులే కీలకం



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం కొప్పవరం పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు దుస్తులు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి తన సొంత సొమ్ముతో వీటిని సమకూర్చారు. స్థానిక గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగు పరిచేందుకు పారిశుధ్య కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీయే సమష్టి లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అనుబంధ కమిటీలకు దిశానిర్దేశం

రాజానగరం: రాబోయే ఎన్నికలలో నియోజకవర్గం నుంచి 2019లో కంటే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని అనుబంధ విభాగాల కమిటీలకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచించారు. నియోజకవర్గానికి చెందిన పలువురిని వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీలలో నియమించారు. ఎమ్మెల్యే రాజా ఆ వివరాలను వివరాలను తెలియజేస్తూ, వారికి దిశానిర్దేశం చేశారు. ఏ పార్టీకైనా అనుబంధ కమిటీలే ఎంతో కీలకమన్నారు. స్థానికంగా ఉన్న నాయకులను కలుపుకొంటూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో మన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయనే నిజాన్ని అర్థమయ్యేలా వివరించాలన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత, గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శిగా మండపాక శ్రీను (కోరుకొండ మండలం మునగాల), జిల్లా సేవాదళ్ కార్యదర్శిగా అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు (రాజానగరం మండలం తూర్పుగానుగూడెం), సీతానగరం మండల రైతు విభాగం అధ్యక్షుడిగా పిండి రాధాకృష్ణ (రఘునాథపురం), రాజానగరం మండల పంచాయతీ విభాగం అధ్యక్షుడిగా దేనీడి సూర్యనారాయణ (శ్రీకృష్ణపట్నం)ను నియమించారు.



మండపాక శ్రీను



అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు



పిండి రాధాకృష్ణ



దేనీడి సూర్యనారాయణ

కోడి పందేల బరులు ధ్వంసం

సీతానగరం: మండలంలోని నాగంపల్లి శివారున మామిడి తోటల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను తహసీల్దార్ కృష్ణారావు, ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు. అలాగే చినకొండేపూడిలోని చిన్న బరులను కూడా తొలగించారు. సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని దండోరా వేయించారు.

కమిటీతో సమావేశం

కోడి పందేల జరగకుండా చర్యలు తీసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టీమ్ సభ్యులతో తహసీల్దార్ కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భానుతేజ, ఎన్‌జీవో మెంబర్ బైర్రాజు మురళీరాజు పాల్గొన్నారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థాయిలో మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలను నియమించామన్నారు. పబ్లిక్ సెలవులతో నిమిత్తం లేకుండా 24 గంటలు ఫోన్‌లకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు కోడి పందేలు, జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు.



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీతానగరం తహసీల్దార్ కృష్ణారావు

కోడి పందేలకు అనుమతి లేదు

రాజానగరం: హైకోర్టు ఆదేశాల ప్రకారం సంక్రాంతి సంబరాలలో కోడి పందేలకు అనుమతులు లేవని తహసీల్దార్ పవన్ కుమార్ అన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు మండలంలో గ్రామగ్రామాన పోలీసుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు దండోరా కూడా వేయిస్తున్నామన్నారు. 144 సెక్షన్ కూడా అమలులో ఉందన్నారు. కోడి పందేలు, పేకాట, గుండాల జోలికి వెళ్లకుండా సంక్రాంతిని కుటుంబ సభ్యులతో కలసి సరదాగా చేసుకోవాలని సూచించారు. ఇదే విషయంపై సీఐ కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట, గుంటాటలను ఆడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకూ 200 మందిని బైండోవర్ చేశామన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రంగంపేట: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఎస్సై పి.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీం రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో గతంలో కోడి పందేలు నిర్వహించిన బరులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. కోడి పందేల్లో కత్తులు కట్టే అలవాటున్న వ్యక్తులను బైండోవర్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లెక్క చేయకుండా, జూదాలు నిర్వహించినా, పాల్గొన్న వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.